మైదానాలే మండపాలు!

పార్కుల్లో ఫంక్షన్లు • ఇబ్బందులు పడుతున్న ప్రజలు • ఇదేంటని ప్రశ్నిస్తున్న వాకర్స్ • స్పందించని అధికారులు

ప్రజలకు ఆహ్లాదం పంచడానికి నిర్మించిన వాకింగ్ పార్కులు పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలకు వేదికలవుతున్నాయి. పార్కుల్లో వేడుకలు నిర్వహించరాదని నిబంధనలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కొంతమంది స్థానిక నేతల అండతో దర్జాగా ఫంక్షన్లు నిర్వహిస్తున్నారు. దీంతో వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి కార్యక్రమాలకు చెక్ పెట్టాల్సిన అధికారులు మౌనం వహించడంపై వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వాకింగ్ గ్రౌండ్‌లో పెళ్లి వేడుకులకు వేస్తున్న మండపం



ఇందిరాకాలనీ మైదానం ముఖద్వారంలో పెళ్లికి వేసిన సెట్



పవన్‌పుత్రకాలనీలో వాకింగ్ పార్కులో ఆడుతున్న ప్రైవేటు పాఠశాల విద్యార్థులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పరిధిలో ఇందిరాకాలనీ, పవన్‌పుత్రకాలనీలో జీవీఎంసీకి సంబంధించిన విశాలమైన స్థలంలో గత ప్రభుత్వం వాకింగ్ పార్కు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. దీంతో ఆయా ప్రాంత వాకర్స్, ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. వ్యాయామంతో పాటు పిల్లలు వారాంతాల్లో ఆడుకొని ఉత్సాహంగా గడిపేవారు. అయితే కొంత మంది ఇళ్లల్లో జరిగే ఏ శుభకార్యాలకైనా వాకింగ్ పార్కులను వేదికలుగా మార్చుకుంటున్నారు. దీంతో పార్కులు అధ్వానంగా మారడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు.

ఖర్చు ఉండదని...

ప్రైవేట్ కల్యాణ మండపాలు బుక్ చేసుకుంటే వేలాది రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. జీవీఎంసీకి చెందిన వాకింగ్ పార్కు అయితే ఎవరికీ ఓ పైసా కట్టాల్సిన అవసరం లేదు. దీనికి తోడు వ్యర్థాలను విడిచినా జీవీఎంసీ వారే తీసుకుంటారు అన్న ధీమాతో ఇక్కడ ఫంక్షనుప్లే చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం కోసం లక్షల వ్యయంతో జీవీఎంసీ అధికారులు వాకింగ్ పార్కు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తే అవి ఇలా ఉపయోగపడుతుండడంతో నిత్యం ఇక్కడ వాకింగ్ పార్కులకు వచ్చే వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. అనుమతులు లేకుండా వాకింగ్ పార్కుల్లో ఇలాంటి కార్యక్రమాలు చేయరాదు. అందుకు విరుద్ధంగా నడుస్తున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు.

పవన్ పుత్ర కాలనీలో..

అలాగే పవన్‌పుత్రకాలనీలోని వాకింగ్ పార్కును ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం తమ సొంత స్థలం మాదిరిగా వాడుకుంటోంది. పైసా చెల్లించకుండా క్రీడా మైదానంగా.. ఇతర కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు.

వాకింగ్‌కు ఇబ్బంది



ఆరోగ్యం కోసం నిత్యం ఇందిరాకాలనీ వద్ద గల వాకింగ్ పార్కుకు వస్తుంటాను.అయితే గత వారం నుంచి ఇక్కడ వరుసగా పలు వేడుకలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రౌండ్ లోకి వెళ్లి వాకింగ్ చేసుకోలేని పరిస్థితి కలుగుతుంది.అధికారులు దీనిపై స్పందించాలి.

– ఆకుల కనకరాజు, వాకర్, ఇందిరాకాలనీ,

అధికారులు చర్యలు తీసుకోవాలి



పవన్‌పుత్రకాలనీలోని మైదానానికి వాకింగ్‌కు వస్తాను. అయితే ఇక్కడ స్థానిక పాఠశాల వారు తమ కార్యక్రమాలకు.. వారి పాఠశాలలో చదివే పిల్లలను ఆటల కోసం విడిచి పెడుతున్నారు. దీనికి తోడు స్థానికంగా గల పలువురు శుభకార్యాలను ఇక్కడ నిర్వహించడంతో చాలా ఇబ్బందికర పరిస్థితి.అధికారులు స్పందించి ఫంక్షన్లు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలి.

– నాగేశ్వరరావు, వాకర్, పవన్‌పుత్రకాలనీ

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

వాకింగ్ పార్కులను శుభకార్యాల పేరిట అపరిశుభ్రం చేయడం సరి కాదు. దీనిపై సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తాం. పరిశీలన చేసిన అవసరమైన చర్యలు తీసుకుంటాం.వాకర్స్‌కు అసౌకర్యం లేకుండా సౌకర్యాలు కల్పిస్తాం.

– బి.రాము , జోన్-5 జెడీ

హెల్తీ వాకర్స్‌కు అండగా నిలుస్తాం

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



నాగేశ్వరరావును సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: మద్రిపాలెం వుడా లే అవుట్ హెల్తీ వాకర్స్ అసోసియేషన్ 3వ వార్షికోత్సవ వేడుకలు బుధవరం గ్రీన్ బెల్ట్ పార్కులో ఘనంగా జరిగాయి. నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి హెల్తీ వాకర్స్ జిల్లా 101 సభ్యులను శ్రీధర్ సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు వాకింగ్ ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో ఒక భాగమన్నారు. వాకింగ్ , యోగా చేయడం వల్ల ఆరోగ్యం బాగుటుందన్నారు. వాకింగ్ ట్రాక్ లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ ఆఫ్ ఎలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మద్రిపాలెం విభాగం అధ్యక్షుడిగా 2024–25 సంవత్సరానికి అవార్డు అందుకున్న కొలుసు నాగేశ్వరరావును ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

నూతన కమిటీ ఏర్పాటు

అదే విధంగా 2025–26 సంవత్సరానికి హెల్తీ వాకర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. యాక్టింగ్ ప్రెసిడెంట్‌గా కె. నాగేశ్వరరావును, సెక్రటరీగా ఈటి సత్యనారాయణ, కోశాధికారిగా సురేష్‌ను ఎన్నుకున్నారు. హెల్తీ వాకర్స్ స్త్రీ శక్తి పేరిట ఏర్పాటు చేసిన మహిళా విభాగానికి అధ్యక్షురాలి ఈటి వరలక్ష్మిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పైడిమాంబ హుండీ ఆదాయం రూ.1,30,661



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవదాయశాఖ అధికారులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని పైడిమాంబ అమ్మవారి హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను ఈవో పి. సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో కౌంటింగ్ సూపర్‌వైజర్ మురళీమోహన్ పర్యవేక్షణలో శ్రీవారి సేవా సమితి సభ్యులు లెక్కించారు. రూ. లక్ష 30 వేల 661 ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో పైడిమాంబ అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, ఆలయ అనువంశిక ధర్మకర్త పురెడ్డి ప్రకాష్ రెడ్డి, దొడ్డి సతీష్, మళ్ల చిన్న అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ డేగా వద్ద రోడ్డు ప్రమాదం



గాయపడ్డ వ్యక్తిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

మల్కాపురం: మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధి ఐఎన్ఎస్ డేగా వద్ద బుధవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నుంచి గాజువాక వైపు కేటరింగ్ సామగ్రితో వెళ్తున్న బొలెరో వాహనాన్ని ద్విచక్ర వాహనంతో వెళుతున్న వ్యక్తి వెనుక నుంచి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడికి బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే స్థానికుల సహాయంతో 108లో మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం ఫీడర్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. యల్లపువానిపాలెం , భగత్‌సింగ్‌నగర్, మూడు గుళ్ల ఏరియా తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

గాజువాక ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా శ్రీలక్ష్మి



గాజువాక: గాజువాక ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా యార్లగడ్డ శ్రీలక్ష్మి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం గాజువాక అదనపు ప్రధాన జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కమ్ సీనియర్ డివిజన్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, రాజమండ్రిలో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న ఎ.కృష్ణ ప్రసాద్‌ను పదోన్నతిపై గాజువాక అదనపు ప్రధాన జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సీనియర్ డివిజన్ జడ్జిగా నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న అప్పలనాయుడు తదితరులు

దాబాగార్డెన్స్ : జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా ఏపీఎస్ ఆర్టీసీ విశాఖ డిస్పెన్సరీలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైన వారిలో ఎక్కువ మంది రక్తం పోవడంతో మరణిస్తున్నారన్నారు. అందువల్లే రక్తదానం ప్రాణదానంతో సమానమని చెప్పారు. రక్తదానం చేసిన 42 మంది ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.వాణి నీలిమ, రోటరీ క్లబ్ వైద్యులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ అశోక్, అసిస్టెంట్ మేనేజర్ జీవీ గౌరి, అసోసియేషన్ నాయకులు, డిస్పెన్సరీ సిబ్బంది, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. కాలువ మరిచారు!



అభివృద్ధి చేయకుండా వదిలేసిన కల్వర్టు



అభివృద్ధి చేయని కాలువ

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రహదారిలో యునైటెడ్ చర్చి సమీపంలో వరద ముంపు నివారణకు ఇటీవల రహదారి వేశారు. చిన్నపాటి వర్షాలకు ఈ రహదారి ముంపునకు గురై వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు ఎత్తు పెంచి రోడ్డు వేశారు. అయితే ఈ ముంపునకు ప్రధాన కారణమైన కల్వర్టును సరి చేయలేదు. గతంలో దీనిపై జీవీఎంసీ కమిషనర్లు, మంత్రులు వచ్చి పరిశీలించారు. కల్వర్ల గురించి సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు, టౌన్ ప్లానింగ్ అధికారులు ఆదేశాలిచ్చారు. అయితే ఆ నివేదిక ఏమైందో.. కల్వర్టులు ఏవిధంగా ఉన్నాయో తెలియని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. భారీ వర్షాలు పడితే ఈ ప్రాంతంతో పాటు మిగిలిన దిగువ ప్రాంతాలు కూడా ముంపునకు గురవుతాయని స్థానికులు వాపోతున్నారు. ముంపు లేకుండా వరదనీరు దిగువకు వెళ్లే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. మేహాద్రి గెడ్డ గేట్లు తెరిస్తే ప్రమాదకర పరిస్థితులు ఏర్పతాయని వాపోతున్నారు. ముంపు ముప్పు నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవింద నామస్మరణ మార్మోగింది. మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం ఆరుగంటలకు ప్రారంభించిన గిరి ప్రదక్షిణలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామి పచ్చకర్పూరంతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నో హెల్మెట్.. నో ఎంట్రీ

హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు



కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన నో హెల్మెట్, నో ఎంట్రీ బ్యానర్

గోపాలపట్నం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడక పోవడం వల్ల చిన్న చిన్న ప్రమాదాల్లో సైతం ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. దీంతో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్ వాడకం తప్పని సరి చేశారు. దీనిపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలతో పాటు బ్యానర్లు, ప్లకార్డులతో ప్రదర్శనలు ఇస్తున్నారు. అందులో భాగంగా ఎయిర్‌పోర్టు లాఅండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్, కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల వద్ద నో హెల్మెట్... నో ఎంట్రీ అన్న బోర్డులు ఆలోచింపజేస్తున్నాయి.దీంతో ద్విచక్రవాహనంపై వచ్చేవారు తప్పనిసరిగా హెల్మెట్ వేసుకుంటున్నారు. ఈ బ్యానర్ మంచి ప్రభావం చూపిస్తుందని చెబుతున్నారు.

ఘనంగా జాతీయ ఉత్పాదకత దినోత్సవం



ఉత్పాదకతపై ప్రభావం చూపే అంశాలపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్న రామేశ్వరరావు

సింథియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లోని హంసధ్వని ఆడిటోరియంలో బుధవారం జాతీయ ఉత్పాదకత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్పాదకతను పెంచే పలు విషయాలపై కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధికారి రామేశ్వరరావు కార్మికుల సమయ నిర్వహణ, పనిలో స్థిరత్వం, చక్కని నిర్ణయం తీసుకునే జ్ఞానం, టీమ్ వర్క్, టూల్స్ మేనేజ్‌మెంట్ సెషన్ ద్వారా సంస్థలో ఉత్పాదకతపై ప్రభావం చూపే పలు అంశాల గురించి వివరించారు మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో సెషన్ ఆసక్తికరంగా సాగింది. కార్యక్రమంలో సంస్థకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

అధిక ఉత్పత్తితో స్టీల్‌ప్లాంట్ పురోభివృద్ధి



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ తదితరులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి అధిక ఉత్పత్తితోనే సాధ్యపడుతుందని స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ ఏ 2 విభాగాధిపతి బి.జయకుమార్ అన్నారు. విభాగాధిపతిగాబాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు విజయ్‌కుమార్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత క్లిష్టపరిస్థితుల్లో అంతా సమష్టిగా కృషి చేసి అధిక ఉత్పత్తి సాధించాల్సి ఉందన్నారు. ఇందు కోసం కార్మిక సంఘాలు, కార్మికులు ముందుకు సాగాలన్నారు. కార్మికుల సమస్యలపై తనకు పూర్తిగా అవగాహన ఉందని, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్, ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్‌ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు, పి.వి.రమణమూర్తి, కారు రమణ, ఎన్.ఎ. నాయుడు, దేముడు, డి.మోహన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ట్రైనర్ నఫీసా బరోడావాలా

సీతంపేట : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఇంటర్వ్యూలో విజయం సాధించేందుకు అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను స్థానిక విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ రంగంలో 22 సంవత్సరాల అనుభవం ఉన్న నఫీసా బరోడావాలా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో పాల్గొనే యువత జస్ట్ ఏ మినిట్ సెషన్ ద్వారా తమ ఆలోచనా సామర్థ్యాలను పదును పెట్టుకుంటారని తెలిపారు. మాక్ ఇంటర్వ్యూ డ్రిల్ ద్వారా అనుభవాన్ని పొందుతారన్నారు. గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డి.ఎస్.వర్మ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో టీమ్‌వర్క్, ఆత్మవిశ్వాసం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, సానుకూల దృక్పథం పెంపొందుతాయని తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న స్కిల్స్ ప్రాక్టీస్ చేయడం ద్వారా తొలి ప్రయత్నంలోనే ఇంటర్వ్యూలో విజయం సాధిస్తారని తెలిపారు.

వైభవోపేతంగా శ్రీలలితాదేవి నగరోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీలలితాదేవి పల్లకీ ఊరేగింపు

సీతంపేట : శ్రీలలితాపీఠం వార్షికోత్సవాల ముగింపు, మాఘ పౌర్ణమి సందర్భంగా శ్రీలలితాదేవిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై బుధవారం సాయంత్రం ఊరేగించారు. మేళతాళాలు, కోలాటం , తప్పెటగుళ్లు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ నగర వీధుల్లో ఊరేగింపు కనుల పండువగా సాగింది. అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠం వద్ద ప్రారంభమైన నగరోత్సవం శంకరమఠం రోడ్, డైమండ్ పార్క్, దొండపర్తి కూడలి, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ మీదుగా తిరిగి పీఠానికి చేరుకుంది. అమ్మవారి పల్లకీ మోయడానికి భక్తులు పోటీ పడ్డారు. అడుగడుగునా అమ్మవారికి హారతులు, టెంకాయలతో నీరాజనాలు పలికారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీస్వామి టాపులేని కారులో ఊరేగింపులో పాల్గొన్నారు. ముందుగా ఉదయం పీఠంలో లలితాదీక్ష చేపట్టిన భక్తులు దీక్ష విరమించారు. అలాగే గురుపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కుర్తాళం పురోహితులు మాచవోలు రమేష్‌శర్మ, లలితాపీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్, ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బౌద్ధాలయంలో మాఘ పౌర్ణమి పూజలు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం అశోక్‌నగర్‌లో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని బుద్ధునికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ప్రముఖ బౌద్ధ ఉపాసకులు కదలి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నాది అనేది అశాంతి, నాది కాదనేది శాంతి అని ఉపదేశించారు. సమాజంలో బుద్ధునికి గౌరవమైన స్థానం ఉందన్నారు. ఈ నెల 19న ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం వ్యవస్థాపకులు మల్లారపు అర్జున్ రావు జయంతిని పురస్కరించుకుని పలు సేవా కార్యాక్రమాలు నిర్వహించనున్నట్లు సమాజం కార్యదర్శి రాజుగణేష్ తెలపారు. అనంతరం వృద్ధులు, మహిళలకు చీరలు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈ.రాజు, భీమరావు, రాజారావు, ఒ.తాతారావు, లక్ష్మి, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

దాబాగార్డెన్స్ : కనక మహాలక్ష్మి దేవస్థానంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రనవావర్ణార్చన, లక్ష్మీహోమం జరిపారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తీరం.. జన సంద్రం

- పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన పాతగంగవరం, అప్పికొండ తీరాలు
- ఘనంగా మాఘ పౌర్ణమి పూజలు



పాత గంగవరం తీరంలో సముద్రస్నానాలు చేస్తున్న భక్తులు



పూజలందుకున్న మాధవ స్వామి, మహాలక్ష్మిదేవి

పెదగంట్యాడ: మాఘ పౌర్ణమి పురస్కరించుకుని పుణ్యస్నానాలు ఆచరించడానికి భక్తులు పోటెత్తారు. పాతగంగ వరం తీరంలో మంగళవారం రాత్రి జాగరణ చేసిన భక్తులు బుధవారం వేకువజామునే పవిత్ర స్నానాలు ఆచరించి తీరంలో కొలువైన మాధవ స్వామి, మహాలక్ష్మి దేవిని దర్శించుకున్నారు. భక్తుల కోసం తాగునీరు, ప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు గరికిన అప్పలరాజు, చోడిపల్లి ముసలయ్య, పల్లేటి దేముడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

- 77వ వార్డు అప్పికొండ తీరానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం రాత్రి జాగారణ చేసిన భక్తులు బుధవారం ఉదయం అప్పికొండ తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అతిథి అధ్యాపకులకు పన్ను మినహాయింపునకు వినతి

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని గెస్ట్ ఫ్యాకల్టీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆదాయ పన్ను శాఖ అధికారులను కలసి వినతి పత్రం అందజేసినట్లు డాక్టర్ ఎం.సురేష్ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీలు అత్యధికంగా పనిచేస్తున్నందున వర్సిటీ నుంచి లెటర్ పంపిస్తే, దీనిపై పరిశీలన చేస్తామన్నారని సురేష్ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ అధికారులు ఫామ్–13 అప్లై చేసి అతిథి అధ్యాపకులకు టీడీఎస్ నుంచి మినహాయింపు పొందే అవకాశం కల్పించాలని కోరారు. గెస్ట్ ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దాస్, డాక్టర్ శిరీష్ తదితరులు పాల్గొన్నారు.